RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 3 Issue: 169 | Wednesday, October 15, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి:3 సంచిక:169 | బుధవారం, అక్టోబర్ 15, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

## ఐరాసలో పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన భారత్



- బాలల హక్కుల ఉల్లంఘన, సీమాంతర ఉగ్రవాదంపై గట్టిగా నిలదీత
- 'ఆపరేషన్ సిందూర్'ను సమర్థించుకున్న బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే
- ఉగ్రవాదుల ఏరివేతకే సర్జికల్ స్ట్రైక్స్ చేశామని స్పష్టీకరణ

ఐక్యరాజ్యసమితి : ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, బాలల హక్కులను పాకిస్థాన్ ఘోరంగా ఉల్లంఘిస్తోందని మండిపడింది. ఉగ్రవాదులను ఏరివేసేందుకు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తాము చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను భారత్ గట్టిగా సమర్థించుకుంది. ఇది తమ ప్రజలను, ముఖ్యంగా పిల్లలను కాపాడుకోవడానికి తీసుకున్న చట్టబద్ధమైన చర్య అని స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి 80వ సర్వసభ్య సమావేశంలో భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో సభ్యుడిగా ఉన్న బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే మాట్లాడారు. బాలల హక్కుల ఉల్లంఘనలో పాకిస్థాన్ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశాల్లో ఒకటిగా ఉందని ఆయన విమర్శించారు. ఐరాస సెక్రటరీ జనరల్ 2025 నివేదికను ఉటంకిస్తూ, పాకిస్థాన్ జరుపుతున్న సరిహద్దు దాడులు, షెల్లింగ్ కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌లో ఎంతో మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారని లేదా తీవ్రంగా గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "పాకిస్థాన్ తమ దేశంలో జరుగుతున్న తీవ్రమైన బాలల హక్కుల ఉల్లంఘనల నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించే ప్రయత్నాలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాక్ సైన్యం జరిపిన వైమానిక దాడులు, షెల్లింగ్‌లో ఆఫ్ఘన్ చిన్నారులు చనిపోయినట్లు ఐరాస నివేదికే స్పష్టం చేసింది" అని దూబే తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో మతం పేరుతో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది అమాయక పౌరులు మరణించిన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఈ క్రూరమైన దాడిని అంతర్జాతీయ సమాజం మరిచిపోలేదని అన్నారు. దీనికి ప్రతిస్పందనగానే 2025 మే నెలలో 'ఆపరేషన్ సిందూర్' కింద పాకిస్థాన్, పీవోకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించామని వివరించారు. "భారత్ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుంటే, పాకిస్థాన్ మాత్రం మా సరిహద్దు గ్రామాల్లోని పౌరులు, పిల్లలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేసి వారి మరణానికి కారణమైంది" అని ఆయన ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలపై నీతులు చెప్పడం కపటత్వానికి నిదర్శనమని దూబే విమర్శించారు. "ముందుగా పాకిస్థాన్ అద్దంలో తన ముఖం చూసుకోవాలి. తమ దేశంలోని పిల్లలను రక్షించుకోవడంపై దృష్టి పెట్టాలి. మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకోవడం ఆపాలి" అని హితవు పలికారు. ఇదే సమయంలో, భారత్‌లో పిల్లల సంరక్షణకు తీసుకుంటున్న 'చైల్డ్ హెల్ప్‌లైన్ 1098' వంటి కార్యక్రమాలను ఐరాస గుర్తించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## మోదీ నా మంచి మిత్రుడు.. అద్భుతంగా పనిచేస్తున్నారు

- ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు
- గాజా శాంతి ఒప్పందం తర్వాత ఈజిప్టులో కీలక వ్యాఖ్యలు
- ఇటీవలే ఫోన్‌లో మాట్లాడుకున్న ఇద్దరు నేతలు
- భారత్‌లో అమెరికా కొత్త రాయబారి సెర్గియో గోర్ పర్యటన
- మోదీకి ట్రంప్ సంతకంతో కూడిన ఫొటో బహుమతి



ఢిల్లీ,: భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకెంతో మంచి స్నేహితుడని, ఆయన అద్భుతంగా పనిచేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని ముగింపు పలుకుతూ కుదిరిన చారిత్రక గాజా శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం, ఈజిప్టులోని షర్మ్ ఎల్-షేక్‌లో సోమవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్ ఒక గొప్ప దేశం, దానికి నా మంచి స్నేహితుడు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చాలా గొప్పగా పనిచేస్తున్నారు" అని ట్రంప్ అన్నారు.

ఇటీవల ప్రధాని మోదీ, ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన కొద్ది రోజులకే ఈ ప్రశంసలు రావడం గమనార్హం. చారిత్రాత్మక గాజా శాంతి ఒప్పందం విజయవంతమైనందుకు గాను ట్రంప్‌కు మోదీ అభినందనలు తెలిపారు. ఈ విషయాన్ని గత వారం ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. తమ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలో వాణిజ్య చర్చల్లో సాధించిన పురోగతి గురించి కూడా సమీక్షించినట్టు పేర్కొన్నారు. నెల రోజుల వ్యవధిలో ఇరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది రెండోసారి.

ఇదే సమయంలో భారత్‌కు అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ ప్రస్తుతం దేశంలో పర్యటిస్తున్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ఇప్పటికే ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమయ్యారు. శనివారం ప్రధాని మోదీతో భేటీ అయిన సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో వారిద్దరూ సమావేశమైనప్పటి ఫొటో ఫ్రేమ్‌ను గోర్ బహుమతిగా అందించారు. ఆ ఫొటోపై "మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, మీరు చాలా గొప్పవారు!" అని ట్రంప్ స్వయంగా సంతకం చేసి రాశారు.

ట్రంప్, మోదీల బలమైన నాయకత్వంలో ఇరు దేశాల మధ్య రక్షణ, వాణిజ్యం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని గోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంప్ మోదీని గొప్ప వ్యక్తిగత మిత్రుడిగా భావిస్తారని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో తమ సంబంధం రానున్న నెలల్లో మరింత బలపడుతుందని గోర్ 'ఎక్స్'లో పోస్ట్ చేయగా, ఆయన నియామకం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్టు మోదీ బదులిచ్చారు.

## కిషన్ రెడ్డి గారూ... ఎన్ని ఓట్లతో ఓడిపోతారు?



### మీ గౌరవం ప్రమాదంలో ఉంది: రాజాసింగ్

హైదరాబాద్,: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేస్తే ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారని కిషన్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉందని రాజాసింగ్ గుర్తుచేశారు. "కిషన్ రెడ్డి గారూ, జూబ్లీహిల్స్‌లో మీరు బీఆర్ఎస్‌ను గెలిపిస్తారా లేక కాంగ్రెస్‌ను గెలిపిస్తారా? అని ప్రజలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఇది మీ గౌరవానికి సంబంధించిన విషయం" అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా, "ఒకవేళ మీరు భారీ ఓట్ల తేడాతో ఓటమి పాలైతే కేంద్రంలోని పెద్దల ముందు మీ ముఖం ఎలా చూపిస్తారు? ఈ విషయం గురించి కొంచెమైనా ఆలోచించారా?" అని విమర్శించారు. తనపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, "నన్ను నాశనం చేసి బయటకు పంపించారు. ఏదో ఒక రోజు మీరు కూడా కచ్చితంగా వెళ్తారు" అంటూ కిషన్ రెడ్డిపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. గత కొంతకాలంగా కిషన్ రెడ్డి, రాజాసింగ్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజా వ్యాఖ్యలతో వీరి మధ్య ఉన్న విభేదాలు మరోసారి స్పష్టంగా బయటపడ్డాయి.

## మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..
## అగ్రనేత వేణుగోపాల్ లొంగుబాటు




గడ్చిరోలి: మావోయిస్టు పార్టీకి అత్యంత కీలకమైన కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా ఉన్న అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన తన అనుచరులు 60 మందితో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి ఊహించని షాక్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా పార్టీ అనుసరిస్తున్న విధానాలతో వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతం చేయాలంటే ప్రజల్లోకి బహిరంగంగా వెళ్లడమే సరైన మార్గమని ఆయన భావించినట్లు సమాచారం. ఇదే విషయంపై పార్టీకి ఆయన రాసిన ఓ లేఖ తీవ్ర కలకలం రేపింది.

కొన్ని రోజుల క్రితం, దివంగత మావోయిస్టు నేత, తన సోదరుడైన మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్‌జీ) పేరుతో రాసిన మరో లేఖలో కూడా ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాను పార్టీ నుంచి శాశ్వతంగా వైదొలగుతున్నట్లు వేణుగోపాల్ ప్రకటించారు.

కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీలో ఇకపై కొనసాగలేనని స్పష్టం చేస్తూ ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. ఈ ప్రకటన చేసిన కొన్ని రోజులకే, తన అనుచరులతో కలిసి గడ్చిరోలి పోలీసుల ఎదుట ఆయన లొంగిపోవడం గమనార్హం. ఆయన లొంగుబాటుకు దారితీసిన కచ్చితమైన కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## జూబ్లీహిల్స్ లో ఓట్ చోరీ కలకలం




హైదరాబాద్, అక్టోబరు 14, : దరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఫేక్ ఓట్ల కలకలంపై అధికారులు విచారణ జరిపారు. యూసుఫ్ గూడలోని ఒకే ఇంట్లో 43 ఓట్లు ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీంతో యూసుఫ్ గూడ డివిజన్ 246 బూత్ ఓటర్ జాబితాపై గందరగోళంపై అధికారులు విచారణ జరిపారు. సంస్కృతి అవెన్యూకి వచ్చిన విచారణ జరిపిన ఎన్నికల అధికారులు అపార్ట్ మెంట్ కు ఒకే ఇంటి నెంబర్ ఉండటంతో అందరికీ సేమ్ డోర్ నెంబర్ వచ్చిందని తెలిపారు. 5 అంతస్తుల్లో అపార్ట్ మెంట్ ఉండగా అందులో 15 ఫ్లాట్స్ లో నివాసం ఉంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఓటర్ లిస్టులోనూ ఇవే పేర్లు ఉన్నాయి. ఎవరైనా చనిపోతే మాత్రమే ఓట్లను తొలగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఉపఎన్నికల సమయంలో ఓటర్ లిస్టులో భారీ మార్పులకు అవకాశం తక్కువ అని అధికారులు స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు తొలి రోజు 10 నామినేషన్ల దాఖలయ్యాయి. 10మంది అభ్యర్థుల 11 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఉపఎన్నికకు స్వతంత్ర అభ్యర్థి సిలివేరు శ్రీకాంత్ తొలి నామినేషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. 14న ఫలితాలు వెల్లడి కాబోతున్నాయి. ఒక అభ్యర్థి రెండు సెట్ల నామినేషన్లు వేశారు. దీంతో 11 నామినేషన్ పత్రాలు వచ్చాయి. దీనికి సంబంధించిన సమాచారం రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. 19, 20వ తేదీలలో సెలవులు ఉంటాయని అప్పుడు నామినేషన్లు స్వీకరించము అని చెప్పారు. 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 22న స్క్రూటీని ఉంటుందన్నారు. బోగస్ ఓట్ల అంశంపైనా రిటర్నింగ్ అధికారి స్పందించారు. దీనికి సంబంధించి ఎంక్వైరీ అధికారిగా యూసుఫ్ గూడ డిప్యూటీ కమిషనర్ ను పెట్టామన్నారు. ఆయన పూర్తి సమాచారాన్ని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారికి అందజేస్తారు. ఇప్పుడున్న ప్రాథమిక సమాచారం మేరకు ఇవి గతం నుంచే ఉన్న ఓట్లు, ఇప్పుడు ఉప ఎన్నిక సందర్భంగా నమోదైన ఓట్లు కావు అనేది రిటర్నింగ్ ఆఫీసర్ చెబుతున్నారు. మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చాలా సాఫీగా సాగింది.

భారీగా దొంగ ఓట్లు: దాదాపు 20వేల దొంగ ఓట్లు ఉన్నట్లు తమకు అనుమానం ఉందన్నారు. దొంగ ఓట్లతో గెలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందన్నారు. అధికార ఎమ్మెల్యేలు స్వయంగా వరల్డ్ బ్యాంక్ కి అర్జీలు పెట్టుకుంటున్నారని విమర్శించారు. దొంగ ఓట్లపై ఫిర్యాదు చేసిన కేటీఆర్.. ఎన్నికల సంఘానికి మూడు విజ్ఞప్తులు ఇచ్చారు. ఓట్ల చోరీపై వెంటనే పూర్తి స్థాయి విచారణ జరగాలని, క్షేత్రస్థాయిలో కుమ్మక్కైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నామినేషన్ ప్రక్రియ ముగిసేలోపు విచారణ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "రాహుల్ గాంధీ అక్కడ ఓట్ల చోరీ అని గగ్గోలు పెడుతున్నారు. తెలంగాణలో మాత్రం వారే దొంగ ఓట్లతో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దొంగ ఓట్లపై ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. విచారణ కోరాం. కాంగ్రెస్ పార్టీ 20 వేల వరకు దొంగ ఓట్ల కోసం ప్రణాళికలు రచించింది. నియోజకవర్గంలో ఒక ఇంట్లో 250 ఓట్లు, మరో ఇంట్లో 180, ఇంకొక ఇంట్లో 80, మరొక ఇంట్లో 90 ఓట్లు ఉన్నాయి. ఒక ఇంట్లో 24 ఓట్లు ఉన్నాయి. తనిఖీకి వెళ్లినప్పుడు వారంతా ఎవరో తనకు తెలియదని ఇంటి యజమాని చెప్పారు. అక్కడికి వెళ్లి చూస్తే అవన్నీ దొంగ ఓట్లు అని తేలింది" అని కేటీఆర్ అన్నారు.

## సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు



### హైకోర్టు తీర్పు తమకు నిరాశ కలిగించింది
### ఎస్ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్
### మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి

న్యూఢిల్లీ, :పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు. ఇదిలావుంటే బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్ఎల్‌పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్ఎల్‌పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్ లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33శాతం మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావించింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలంటూ పిటిషన్ లో పేర్కొంది. న్యాయం తమవైపు ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. సుప్రీంలో తప్పకుండా అనుకూల తీర్పు వస్తుందని అన్నారు.

### మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను శిక్షించాలి
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

వేమనపల్లి : వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏటా మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొన్నారు. మంగళవారం మధుకర్ స్వగ్రామం నీల్వాయిలో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మధుకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మధుకర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా బీజేపీ ఆదుకుంటుందని, మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను శిక్షించే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీలో కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉన్నప్పటికీ పోలీసులు ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదు అని ప్రశ్నించారు. ఇవాళ రామగుండం పోలీస్ కమిషనర్ ను కలిసి కేసు పురోగతిపై చర్చించనున్నట్టు తెలిపారు. బీజేపీ కార్యకర్తలు ఎవ్వరూ మనోధైర్యం కోల్పోవద్దని, మీకు అన్ని విధాలుగా పార్టీ ఆదుకుంటుందని తెలిపారు.

తెలంగాణ షాన్
TELANGANA SHAAN
బుధవారం, అక్టోబర్ 15, 2025
Wednesday, October 15, 2025

తెలంగాణ షాన్

# సంపాదకీయం

## మావోయిస్టుల్లో మార్పు సాధ్యమేనా..?

ఆపరేషన్ కగార్.. మావోయిస్టులను కంగారెత్తిస్తున్నాయి. అందుకే కాల్పుల విరమణ పాటిద్దాం.. చర్చలకు సిద్ధం అని చెప్పడం సంచలనంగా మారింది.ఇకపై ప్రజాపోరాటాల్లో పాల్గొంటామన్న మావోలు. మావోయిస్టు పార్టీ తీసుకున్న సంచలన నిర్ణయం చుట్టూ పెద్ద కథే నడుస్తోంది. ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేటెస్ట్ గా ఒక ప్రకటన రిలీజ్ అయింది. అభయ్ పేరుతో చలామణి అవుతున్న కిషన్ సోదరుడు మల్లోజుల వేణుగోపాల్ ఫోటోను తాజా స్టేట్ మెంట్లో ప్రింట్ చేశారు. అంతే కాదు ప్రజాభిప్రాయాలు పంచుకునేందుకు ఫేస్ బుక్, ఈ మెయిల్ ఐడీలను జత చేశారు. నిజానికి మావోయిస్టులు గతంలో ఎన్నడూ ఇలా చేసిన దాఖలాల్లేవు. కానీ ఇది నిజమే అంటున్నారు. నెల రోజుల తర్వాత బయటికొచ్చిన స్టేట్మెంట్. ఆగస్టు 15వ తేదీతో ఉన్న ఈ స్టేట్ మెంట్ నెల రోజుల తర్వాత అంటే సెప్టెంబర్ 16న రాత్రి వెలుగులోకి వచ్చింది. శాంతి చర్చకు సిద్ధమే అన్న సంకేతాలు పంపారు. ఈఏడాది మార్చి నుంచి మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వంతో శాంతిచర్చలకు నిజాయతీగా ప్రయత్నిస్తోందని, మే 10న పార్టీ ప్రధాన కార్యదర్శి స్వయంగా పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఆయుధాలను వదులుకుంటున్నట్లు ప్రస్తావించారు. ప్రభుత్వానికి కాల్పుల విరమణ ప్రతిపాదించారు. అయితే కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా రియాక్ట్ కాలేదు. ఒకవైపు తుపాకులు చేతబట్టి ఇంకోవైపు చర్చలు అంటే ఎలా అని క్వశ్చన్ కూడా చేశారు. వీటికి తోడు 2024 జనవరి నుంచి బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేయించి దొరికితే ఎన్ కౌంటర్ అన్నట్లుగా వ్యవహారం నడిపిస్తోంది. చాలా మంది ఎన్ కౌంటర్లలో హతమయ్యారు. ఇందులో పార్టీ అగ్రనేతల నుంచి కామన్ మావోయిస్టుల దాకా ఉన్నారు. మే 21న గుండెకోట్ సమీపంలో జరిగిన భీకర దాడిలో పార్టీ ప్రధానకార్యదర్శి బస్వరాజ్‌తో పాటు 28 మంది చనిపోయారు. ఆపరేషన్ కగార్‌ను స్పీడప్ చేసిన కేంద్రం. పైగా కేంద్రం ఆపరేషన్ కగార్ ను స్పీడప్ చేసింది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల అంతమే పంతంగా ముందుకెళ్తోంది. మొన్నటికి మొన్న కర్రెగుట్టల్ని జల్లెడ పట్టి కథ ముగించారు. ఇంకా కూంబింగ్స్ పెద్ద ఎత్తున సాగుతున్నాయి. గ్రౌండ్ నుంచి హెలికాప్టర్లు ఇలా అన్ని చోట్లా గాలింపు పెరగడంతో మావోయిస్టులకు షెల్టర్ కరువైంది. దీంతో బస్వరాజ్ ఆలోచనలకు తగ్గట్లుగా శాంతిచర్చలను ముందుకు తీసుకెళ్లాలని తాము నిర్ణయించుకున్నామంటోంది మావోయిస్టు పార్టీ. ఆయుధాలు విదిలి జనజీవన స్రవంతిలో కలవాలన్న ప్రధాని సూచనతో తాము వెపన్స్ వదిలేయాలని డిసైడ్ చేసుకున్నామంటున్నారు. హోంమంత్రి లేదంటే ఆయన ప్రతినిధి ఎవర్ని నియమించినా చర్చలకు సిద్ధమంటున్నారు. అయితే తమ అభిప్రాయం చెప్పడానికి తమ ఇతర సహచరులు, అలాగే జైళ్లలో ఉన్న మావోయిస్టు నేతలను సంప్రదించి నిర్ణయం ప్రకటిస్తామని, ఇందుకోసం నెల రోజుల టైం ఇవ్వాలన్నారు. ఆ లోపు కూంబింగ్ వద్దు.. బలగాల కాల్పులు వద్దు అని కోరుకుంటున్నారు. చర్చల విషయంలో ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారానైనా తమ అభిప్రాయాలను పంచుకోవడానికి రెడీ అంటున్నారు. సో ఇప్పుడు అసలు గేమ్ షురూ కాబోతోంది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల్ని నామరూపాల్లేకుండా చేయాలని, పూర్తిగా రెడ్ కారిడార్ అన్నదే లేకుండా చేయాలన్న లక్ష్యంతో కేంద్రం ఉంది. అయితే మావోయిస్టులను లొంగిపోయేలా చేయడం, లేదంటే ఎన్ కౌంటర్లలో హతమార్చడం ఈ రెండే టార్గెట్. మధ్యలో చర్చలకు తావు లేదని కేంద్రం అంటోంది. మరి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందన్నది కీలకంగా మారింది. మావోయిస్టుల్లో ఇప్పుడు అగ్రనేతలంతా చాలా వరకు ఎన్ కౌంటర్ అయ్యారు. కొందరే మిగిలారు. అందులో చాలా మంది లొంగిపోవడానికి రెడీగా లేరు. చావో రేవో అంటున్నారు. అటు మరికొందరు కగార్ తో ఏ ఒక్కరు కూడా బతికే పరిస్థితి లేదంటున్నారు. అందుకే ఆయుధాలు వదిలి చర్చలకు ప్రయత్నిద్దామని చెప్పి ఇలా లేఖ రిలీజ్ చేశారా? అసలు ఈ లేఖ నిజమా కాదా అన్నది కూడా మరో డౌట్ గా మారింది. మరిప్పుడు గేమ్ ఎలా మారబోతోంది? జనంలోనే ఉండి పోరాటాలు చేస్తారా? కేంద్ర ప్రభుత్వం అస్సలు ఛాన్స్ ఇవ్వట్లేదు. ఈ మొత్తం ఎపిసోడ్ లో సామాన్యులకు ఇబ్బందులు వస్తున్నాయని, కోవర్టులని, మరొకటని సమస్యలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. దీంతో ఏ ప్రజల కోసమైతే అడవుల బాట పట్టారో ఇప్పుడు జనంలోనే ఉండి ప్రజాపోరాటాలు చేయాలన్న నిర్ణయానికి మావోలు వచ్చారా అన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ మావోయిస్టులు నిజంగానే తుపాకులు వదిలి జనజీవన స్రవంతిలోకి వస్తే వెనుకబడిన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందంటున్నారు. నిజానికి కేంద్రం ప్రభుత్వం మావోయిస్టులతో అసలు చర్చలే లేవంటోంది. అయితే లొంగిపోవడం, లేదంటే ఎన్ కౌంటర్ అవడం రెండే ఆప్షన్లు ఇచ్చింది. సో నెల రోజులు కాల్పుల విరమణ కొనసాగుతుందా లేదా అన్నది కూడా పెద్ద డౌటే. తెలంగాణ, ఏపీ, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర ఇలా రెడ్ కారిడార్ ఏరియాల్లో అగ్రనేతలంతా ఒక్కొక్కరుగా వచ్చి డీజీపీలు, ఐజీలు ఇలా పోలీస్ ఆఫీసర్ల ముందు లొంగిపోతున్నారు. ఇటీవలే తెలంగాణలో డీజీపీ ముందు సుజాతక్క సరెండర్ అయ్యారు. మావోలకు బలగాలపై తిరగబడే పరిస్థితి ఉందా? సో కేంద్ర ప్రభుత్వం సిగ్నల్స్ ప్రకారం చూస్తే మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని వదులుకోవడమే మార్గంగా కనిపిస్తోంది. బలగాలపై తిరగబడే పరిస్థితి అసలే లేదు. సామాజిక సమస్యలపై దృష్టి పెట్టి ప్రజా పోరాటాలే చేయడం మార్గం ఉంది. సో ఫైనల్ గా మావోయిస్టు ఉద్యమంలో బిగ్ ట్విస్ట్ వచ్చినట్లైంది. ఆపరేషన్ కగార్ ఎఫెక్ట్ తో కథ మారిపోతోంది. పెద్ద ఎత్తున సరెండర్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 600 మంది వరకు మావోయిస్టులు అరెస్ట్ అవడం లేదంటే లొంగిపోవడం జరిగాయి. గత 16 నెలల్లో 1600 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. సిపిఐ మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ పూర్తి సరెండర్‌కు రెడీ అని ప్రకటించడం వెనుక పెద్ద కారణాలే ఉన్నాయి. ఈ ఏడాది 192 మంది ఎన్ కౌంటర్ అయ్యారు. గత 9 నెలల్లో 210 మంది, గత 15 నెలల్లో 400 మంది హతమయ్యారు. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. ఎందుకంటే సైనిక బలగాలు డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లక్ష మంది పారా-మిలిటరీ బలగాలతో హైటెక్ ఆపరేషన్లు చేస్తున్నాయి. దీంతో మావోయిస్టులు ఎక్కడా తలదాచుకోలేపోతున్నారు. వారి జాడను ఈజీగా పసిగట్టేస్తున్నాయి.

# జమ్మిగడ్డ భూ కబ్జా దారులకు హైకోర్టులో చుక్కెదురు

**-12 గుంటల స్థలానికి ఫెన్సింగ్ వేసిన రెవిన్యూ అధికారులు**

**-ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు ఫిర్యాదు**






**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 14, (తెలంగాణ షాన్) :**

ఏఎస్ రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలోని 199/1, 376 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములలో భూ కబ్జాలకు పాల్పడిన భూ కబ్జా దారులకు మంగళవారం హైకోర్టులో చుక్కెదురైంది. హైకోర్టులో డబ్ల్యూపి 31099/2025తో స్టే కోసం భూ కబ్జా దారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అసలు అవీ ప్రభుత్వ భూములా..! కాదా అన్న విషయాన్ని తహసిల్దార్ లేదా కలెక్టర్ నిర్ణయించాలని కోర్టు తేల్చి చెప్పింది.ఈ విషయంలో ఫిర్యాదు దారు, స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డిని ప్రతి వాదిగా చేర్చకుండా నిజాలను దాచిపెట్టి కోర్టును సంప్రదించారు. విషయం తెలుసుకున్న ఫిర్యాదు దారు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి చివరి నిమిషంలో తన న్యాయవాది ద్వారా వాస్తవాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఫిర్యాదుదారు శిరీష సోమశేఖర్ రెడ్డి వాదనతో ఏకీభవించిన కోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఫిర్యాదుదారును ప్రతి వాదిగా చేర్చి వాస్తవాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. అదే విధంగా తహసిల్దార్ ఇచ్చిన నోటీసులపై వివరణ ఇవ్వకుండా కోర్టును సంప్రదించడమేమిటని న్యాయమూర్తి ప్రశ్నించారు. నోటీసులకు తహసిల్దార్ కు సమాధానం ఇవ్వాలని, సంతృప్తి చెందని పక్షంలో కలెక్టర్ ను సంప్రదించాలని న్యాయమూర్తి సూచించారు. ఇదిలా ఉండగా కబ్జాదారులు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిని సంప్రదించారు. ప్రభుత్వ భూముల్లో కబ్జాలను సహించేది లేదని విజయేందర్ రెడ్డి తేల్చి చెప్పారు. అంతే కాకుండా జమ్మిగడ్డలో కబ్జా చేయగా మిగిలిన దాదాపు 12 గుంటల స్థలాలకు కాప్రా తహసిల్దార్ సుచరిత ఆధ్వర్యంలో కడిలతో ఫెన్సింగ్ వేశారు. దీంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏఎస్ రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరు గగన్ కుమార్ లు చేస్తున్న కృషిని పలువురు ప్రశంసించారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న స్థలాల్లో ప్రజా ఉపయోగకరమైన పనులకు ఉపయోగించాలని వారు సూచించారు. కబ్జా దారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు చర్లపల్లి కాలనీల కుటుంబాలు మేడ్చల్ జిల్లా కలెక్టర్, జిల్లా రెవిన్యూ ఉన్నతాధికారులకు, కాప్రా మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

# డ్రగ్స్ మాఫియాకు పోలీస్ పంజా - హైదరాబాద్ సీపీ సజ్జనార్ మాస్టర్ ప్లాన్ - స్థానిక ప్రజలతో కలిసి యుద్ధం

**-అక్రమ రవాణాపై ప్రత్యేక అవగాహన. కవాడిగూడ, బన్సీలాల్‌పేట్‌లో హైదరాబాద్ పోలీసుల చొరవ.**

**-'ఆపరేషన్ నార్కో, సాత్వా మాల్ వద్ద ప్రజల్లో చైతన్యంబీ డీసీపీ శిల్పవల్లి ప్రత్యేక దృష్టి..రంగంలోకి గాంధీ నగర్ పోలీస్**








**హైదరాబాద్, తెలంగాణ షాన్,అక్టోబర్ 14:**

మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా హైదరాబాద్ సిటీ పోలీస్ సెంట్రల్ జోన్ పరిధిలోని కీలక ప్రాంతాలలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించింది. యువత, స్థానిక నివాసితులను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు మరియు నేర రహిత సమాజాన్ని నిర్మించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.?ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు?నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఐపీఎస్ మరియు డీసీపీ సెంట్రల్ జోన్ కె.శిల్పవల్లి ఐపీఎస్ ఈ అవగాహనా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వారి సూచనల మేరకు, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీ బోస్ కిరణ్, ఎస్ఐ హరీష్, మరియు ఇతర సెక్టార్ ఆఫీసర్స్ కవాడిగూడలోని సాత్వా మాల్ పరిసరాల్లో, అలాగే బన్సీలాల్‌పేట్ సిసి నగర్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.?ప్రధాన అంశాలు ?మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు: డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా, ఆర్థికంగా, కుటుంబపరంగా ఎదురయ్యే తీవ్ర నష్టాలను, ముఖ్యంగా యువత భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందో అధికారుల బృందం ఉదాహరణలతో వివరించింది.?చట్టపరమైన చర్యలు: డ్రగ్స్ విక్రయాలు, వినియోగం మరియు అక్రమ రవాణా చేసే వారిపై ప్రభుత్వం మరియు పోలీసులు తీసుకునే కఠిన చట్టపరమైన చర్యలను గురించి ప్రజలకు స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణ చట్టం (%NDPS Act%) గురించి వివరించారు.?సమాచారం అందించండి: తమ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిస్తే, వెంటనే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. డ్రగ్స్ రహిత హైదరాబాద్ లక్ష్యాన్ని సాధించడానికి ప్రజలందరూ పోలీసులతో సహకరించాలని కోరారు.?ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక యువకులు మరియు ప్రజలు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, మాదక ద్రవ్యాల నియంత్రణకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# అవేర్‌నెస్ ప్రోగ్రామ్' విజయవంతం: ట్రాఫిక్, సైబర్ క్రైమ్, డ్రగ్స్, ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన







**సికింద్రాబాద్, తెలంగాణ షాన్, అక్టోబర్ 14:**

మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, YMCAలో మంగళవారం రోజు మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యార్థులకు అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నివారణ (Anti-Drug), ర్యాగింగ్ నిరోధం (Anti-Ragging) వంటి కీలక అంశాలపై విద్యార్థులను చైతన్యపరచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ అవగాహన సదస్సును మార్కెట్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ (SHO), వి. రాంచందర్ పర్యవేక్షించారు. ఆయనతో పాటు సబ్-ఇన్‌స్పెక్టర్లు ఏ. నరేష్, సి.హెచ్. రవి, మరియు కె. మహేశ్వరి పాల్గొన్నారు. ప్రత్యేకంగా, సైబర్ నేరాల అంశంలో అవగాహన కల్పించేందుకు సైబర్ క్రైమ్ వారియర్ విమెన్ సిబ్బంది జి. సౌజన్య మరియు సింధు కూడా ఈ బృందంలో ఉన్నారు. పోలీస్ అధికారులు విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, పైన పేర్కొన్న అంశాలకు సంబంధించిన వివిధ చట్టపరమైన మరియు భద్రతా అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలను, మరియు ర్యాగింగ్ చట్టరీత్యా నేరమనే విషయాన్ని ఈ సందర్భంగా వివరించారు. ఈ సెషన్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉందని కాలేజీ యాజమాన్యం తెలియజేశారు.

# దగ్గు సిరప్‌పై కట్టుదిట్టమైన చర్యలు అవసరం : డాక్టర్ దివ్య చందన

**హైదరాబాద్, అక్టోబర్ 14 - తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్**

మిషన్ మోదీ రాష్ట్రీయ సంఘ్ తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య పారిశుద్ధ్య విభాగాధ్యక్షురాలు , రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, దక్షిణ భారత ఉపాధ్యక్షురాలు డాక్టర్ దివ్య చందన ఇటీవల దేశంలోని పలు ప్రాంతాల్లో కలుషిత దగ్గు సిరప్ సేవించడంతో పిల్లలు మరణించిన ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె ఈ పరిస్థితి అత్యంత దురదృష్టకరమైనదే కాకుండా, ఔషధ తయారీ మరియు పర్యవేక్షణ వ్యవస్థల్లో ఉన్న తీవ్రమైన లోపాలను బయటపెడుతోందని అన్నారు.డాక్టర్ దివ్య చందన కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి, డైఎథిలీన్ గ్లైకాల్ వంటి ప్రమాదకర రసాయనాల వినియోగంపై ప్రమాణాలు నిర్ధారించి, వాటి వాడకంపై కఠిన నియంత్రణలు అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఔషధ తయారీ యూనిట్లను పర్యవేక్షించేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు, తద్వారా ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఉండవచ్చని తెలిపారు.



"పిల్లల ప్రాణం ఏ నిర్లక్ష్యానికీ బలికావద్దు. మార్కెట్లో లభించే ప్రతి ఔషధం సురక్షితంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని డాక్టర్ చందన అన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏ ఔషధం ఇవ్వడానికి ముందు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని, అలాగే అనుమానాస్పద లేదా ప్రమాదకరమైన ఔషధాలను తక్షణమే ఆరోగ్య అధికారులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# DGP గా ఎన్నికైన కుమారి దీరావత్ నాయక్ కి శుభాకాంక్షలు విటల్ నాయక్



**కాప్రా అక్టోబర్ 14**

టీజీపీఎస్సీ గ్రూప్ వన్ ఫలితాలలో డిజిపిగా ఎన్నికైన కుమారి ధీరావత్ నాయక్ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించిన మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ సీనియర్ కాంగ్రెస్ నాయకులుమేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ TGPSC గ్రూప్-1 ఫలితాల్లో DGP గా ఎన్నికైన కుమారి దీరావత్ సభిత నాయక్కి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. దిరావత్ సభిత నాయక్ విఠల్ నాయక్ కి సోదరి కావడం విశేషం.ఈ సందర్బంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ- కాప్రా సర్కిల్ చక్రిపురం నివాసులు అయిన సోదరి కు.దిరావత్ సభిత నాయక్ TGPSC ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించి డిప్యుటీ సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ పదవి చేపట్టబోతున్నందుకు వారిని అభినందిస్తున్ననన్నారు. బాల్యం నుండి చదువుపై మక్కువతో ఉన్నత పదవి సాధించాలనే తపనతో కష్టపడి చదవి, తాను అనుకున్న పదవినలంకరిస్తూ తల్లిదండ్రుల కలలు నెరవేర్చనున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆశిస్తున్నాననన్నారు. .దిరావత్ సభిత నాయక్ ని కాప్రా పట్టణ యువతకు స్ఫూర్తినందించారని, యువత వారిని ఆదర్శంగా తీసుకొని శ్రద్దగా చదివి ప్రభుత్వ ఉన్నత పదవులలకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరియు కుటుంబ సభ్యులు చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ లపై బంద్ కు సిపిఐ సంపూర్ణ మద్దత్తు

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 14 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్**

బీసీ రిజర్వేషన్ లను అమలు చెయ్యాలని ప్రజలంతా కోరుతున్న సందర్భంలో బీసీ రిజర్వేషన్ లపై హైకోర్టు స్టే ఇవ్వడం తగదని వెంటనే రిజర్వేషన్ లను కల్పించాలని కోరుతూ ఈ నెల 18 నాడు బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్ లో సిపిఐ జిల్లా శ్రేణులన్నీ పాల్గొని జయప్రదం చెయ్యాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ కోరారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ లు అమలు చెయ్యాలని ప్రజలు రాష్ట్రాలు కోరుతుంటే బీజేపీ ప్రభుత్వం నిమ్మకనిరేతినట్లు వ్యవహారిస్తుందని అన్నారు,ఇప్పుడు బీజేపీ అనలు స్వరూపం బయటపడుతుందని అన్నారు. అగ్రవర్ణ కులాల వెనుకబడిన వారికీ ఏ రాష్ట్రం కానీ,ప్రజలు కానీ అడగలేదని,ఎక్కడా ధర్నాలు కానీ నిరసనలు జరగలేదని కానీ బీజేపీ ప్రభుత్వం 10 శాతం కూడా లేనివారికీ 10 శాతం రిజర్వేషన్ లు ఇచ్చి పార్లమెంట్ లో అమోదింప చేసుకొని సుప్రీమ్ కోర్టు విధించిన 50 శాతం పరిమితి కూడా మించిపోయిందని,ఇది బీజేపీ కి అగ్రవర్ణాలకు ఇచ్చే సహకారమని కానీ బీసీ లు అడిగితే మాత్రం చెయ్యట్లేదని ఇప్పటికైనా బీజేపీ నాటకాలు మానేసి బీసీ బిల్లును పార్లమెంట్ లో అమోదించాలని లేకపోతే బీసీ లు బీజేపీ ని రానున్న ఎన్నికల్లో తిరస్కరిస్తారని అన్నారు.బీసీ రిజర్వేషన్ లు అమలు అయ్యేంత వరకు సిపిఐ కార్యకర్తలు పోరాటాలకు నాయకత్వం వహించాలని కోరారు.

తెలంగాణ షాన్
TELANGANA SHAAN



# కనక దుర్గమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యుడగ తాళికోట హరికృష్ణ

### -విజయ వాడ కనక దుర్గా దేవి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యుడు తళికోట హరిక్రిష్ణ ని సన్మానించిన నీరు కొండ సతీష్ బాబు



కాప్రా అక్టోబర్ 14

విజయవాడ కనక దుర్గ దేవి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యుడు గా ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ తెలుగు దేశం పార్టీ ఐ టి డి పి మాజీ అధ్యక్షుడు తళి కోట హరికృష్ణ ని వారి నివాసానికి వెళ్లి కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువ తో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు, టి యన్ ఎస్ ఎఫ్ శివానంద్, మేడ్చల్ నియోజక వర్గం నాగారం మున్సిపల్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారగం ఉమా శంకర్ గౌడ్ సీనియర్ నేతలు గోబేరు రమేష్, వెంకటేష్ ,నిమ్మల శ్రీనివాస్ , బండారు శ్రీకాంత్ యాదవ్, వెంకటేష్ గౌడ్, గోపాల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు నీరు కొండ సతీష్ బాబు తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి

# చర్లపల్లి డివిజన్ నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా- ఎమ్మెల్యే



కాప్రా అక్టోబర్ 14

చర్లపల్లి డివిజన్ నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.చర్లపల్లి డివిజన్ పరిధిలోని సాయి నగర్, ఛక్రిపురం, రామ కృష్ణ నగర్, డబుల్ బెడ్ రూం, లక్ష్మి నగర్, డీసీ కాలనీ, చర్చి కాలనీ, పెద్ద చర్లపల్లి, శ్రీ సాయి గణేష్ నగర్, ఈసీ నగర్, బి ఎన్ రెడ్డి నగర్ లో మంజూరు ఐన పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులు కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది.ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని చాలా గట్టిగా.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భద్రతా చర్యలు పెంచండి.. బంగారం భద్రతకు లాకర్లు తప్పనిసరి - ఇన్స్పెక్టర్ సైదయ్య

### -బంగారం ధరల పెరుగుదల దృష్ట్యా బ్యాంక్ లాకర్లు, సీసీ కెమెరాలు తప్పనిసరి
### -రోడ్డుపై వెళ్లేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి



జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదయ్య

జవహర్ నగర్: తెలంగాణ షాన్, అక్టోబర్ 14.

బంగారం ధరలు అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఇంట్లో కాకుండా బంగారాన్ని తప్పనిసరిగా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదయ్య సూచించారు. ప్రయాణంలో జాగ్రత్తలు ముఖ్యం:ముఖ్యంగా, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు మహిళలు బంగారు ఆభరణాలు ధరించడంలో మరింత జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా నేరస్తులకు అవకాశం కల్పిస్తుందని అన్నారు. వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు: నేరాలను అరికట్టేందుకు ప్రతి వీధిలోనూ, అపార్ట్‌మెంట్లలోనూ సీసీ (క్లోజ్డ్-సర్క్యూట్) కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఇన్స్పెక్టర్ సైదయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. క్రైమ్ రేటు తగ్గింది, గంజాయిపై కఠిన చర్యలు: జవహర్ నగర్ పరిసరాల్లో ఇప్పటికే పోలీసులు విస్తృతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని, దీని ఫలితంగా స్థానికంగా క్రైమ్ రేటు తగ్గిందని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై 'ఉక్కుపాదం' మోపుతున్నామని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనుమానితులపై ఫిర్యాదు చేయండి:ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాధారణ కార్యకలాపాలు గమనిస్తే తక్షణమే 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఇన్స్పెక్టర్ సైదయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం అనివార్యమని ఆయన తెలియజేశారు.

# ఇద్దరు కవల పిల్లల ప్రాణాలు తీసి ఆత్మహత్య చేసుకున్న కన్న తల్లి





కుత్బుల్లాపూర్ అక్టోబర్ 14 తెలంగాణ షాన్ ప్రతినిధి
జెమినీ నాగరాజ్ గౌడ్

ఇద్దరు కవల పిల్లల ప్రాణాలు తీసి నివాసం ఉంటున్న బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్మ చేసుకున్న ఘటన సైబరాబాద్ పోలీస్ కమిషనరేటులోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పద్మనగర్ ఫేజ్ - 1లో ఓఇంట్లో నివాసముంటున్న సాయి లక్ష్మి (27)కు రెండేళ్ల వయసున్న ఇద్దరు కవల పిల్లల ఉన్నారు. అయితే మంగళవారం సూర్యోదయ సమయం 4 గంటలకు సాయి లక్ష్మి మూడోవ అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికులు ఘటన స్థలానికి చేరుకున్నారు, వారి ఇంట్లోకి వెళ్లి చూసారు అక్కడ విగత జీవులుగా ఇద్దరు చిన్నారులు (ఒక బాబు, పాపా) పడి ఉన్నారు. వీరిని తల్లే గొంతు నులిమి హతమార్చి, అనతరం ఆత్మహత్యకు పాలుపడి ఉండచ్చని అనుమానిస్తున్నారు అక్కడి వారు.ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంభ కలహాలే, ఈ విషాదానికి కారణం కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


# రిజర్వేషన్ల రాజకీయంపై శాశ్వత పరిష్కారం ఏంటి...?

ప్రజాస్వామ్యంలో రిజర్వేషన్లు కేవలం రాజకీయ సాధనాలు కావు, అవి సామాజిక న్యాయానికి ఒక నిలువుటద్దం. తెలంగాణ హైకోర్టు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో- 9పై స్టే విధించింది. జీవో ఎంఎస్ నెం. 41, 42 అసంబద్ధమైనవి, రాజ్యాంగ విరుద్ధమైనవిగా పరిగణించబడినాయి. రాజ్యాంగమే సర్వోన్నతమైనది కావున, ఏ కార్యనిర్వాహక ఉత్తర్వు అయినా రాజ్యాంగ సూత్రాలను అతిక్రమిస్తే, న్యాయవ్యవస్థ దానిని రద్దు చేసే అధికారం కలిగి ఉంటుంది. ఈ రిజర్వేషన్ల ప్రక్రియ దేశవ్యాప్తంగా ఒక సంక్లిష్టమైన అధ్యాయంగా మారింది. భారత రాజ్యాంగంలోని 73, 74వ సవరణలు స్థానిక స్వపరిపాలన సంస్థలకు రాజ్యాంగబద్ధతను కల్పించాయి. ఈ సవరణల ప్రకారం, ఆర్టి కల్ 243డి (గ్రామీణ సంస్థలు), ఆర్టికల్ 243టి (పట్టణ సంస్థలు) షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), మహిళలకు రిజర్వేషన్లు తప్పనిసరి చేశాయి. అదే సమయంలో, వెనుకబడిన తరగతులకు (బీసీలకు) రిజర్వేషన్లు కల్పిం చే అధికారాన్ని రాష్ట్ర శాసనసభలకు అప్పగించాయి. అయితే, ఈ రిజర్వేషన్ల అమలు విషయం లో చాలా రాష్ట్రాలు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం, రిజర్వేషన్ల పరిమితిపై సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులే. బీసీల రాజకీయ సాధికారతకు రిజర్వేషన్లు ఎంతో అవసరం. 1980లో మండల్ కమిషన్‌తో కేంద్ర ప్రభు త్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసిన ఈ నివేదిక, బీసీ రాజకీయాలకు ఒక కొత్త శకాన్ని ప్రారంభించింది. ముఖ్యం గా, 'ఎం.ఆర్. బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్' కేసులో రిజర్వేషన్లు ఏ కారణం చేత కూడా 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆధారంగానే 'ఇందిరా సా హ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో రిజర్వేషన్ల పరిమితిపై సుప్రీం స్పష్టతనిచ్చింది. మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రధానంగా విద్యా, ఉద్యోగ రంగాలకు సంబంధించింది. దీనికి అదనంగా, 'కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసుతో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు 'త్రిశూల పరీక్ష' విధానాన్ని తీసుకొచ్చింది. ఈ త్రిశూల పరీక్ష ప్రకారం, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటే మూడు షరతులను తప్పనిసరిగా పాటించాలి. అవి రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల స్థితిగతులపై ఒక ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి, వారి రాజకీయ వెనుకబాటుతనంపై శాస్త్రీయ, వాస్తవిక డేటాను సేకరించాడం రెండు ఈ డేటా ఆధారంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడం, మూడు ఈ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీలతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా చూసుకోవడం. ఈ మూడు షరతులు పాటించకుండా బీసీ రిజర్వేషన్లు కల్పించడం న్యాయస్థానాల్లో నిలబడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నిబంధనలే నేడు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అతిపెద్ద సవాలుగా నిలిచాయి.రాజకీయంగా ఈ సమస్యను పరిష్కరించడానికి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 'త్రిశూల పరీక్ష'ను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ ప్రభుత్వం శ్రీ బూసాని వెంకటేశ్వరరావు, ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) చైర్మన్ గా ఏక వ్యక్తి కమిషన్ మార్చి 2025లో తన నివేదికను సమర్పించింది. తమ విశ్లేషణలో, కమిషన్, విద్య, ఉద్యోగాల్లో, ముఖ్యంగా స్థానిక సంస్థలలో రాజకీయ ప్రాతినిధ్యం కోసం బీసీలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు ఉండాలని సిఫార్సు చేసింది. ఈ రిజర్వేషన్లను అమలు చేయడానికి విద్య, ఉద్యోగాలకు రెండు వేర్వేరు చట్టాలను రూపొందించాలని కూడా కమిషన్ సిఫార్సు చేసింది.

న్యాయపరమైన అడ్డంకులు, సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో, తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు ఒక నిరంతర రాజకీయ, చట్టపరమైన పోరాటంగా మారింది. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయంలో భాగంగా, తెలంగాణ శాసనసభలో తెలంగాణ మున్సిపాలిటీలు (మూడవ సవరణ) బిల్లు, 2025, తెలంగాణ పంచాయతీ రాజ్ (మూడవ సవరణ) చట్టం, 2025లను ఆమోదించింది. విచిత్రమేమిటంటే, గతంలో ఇదే అంశంపై రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి చూస్తున్న సమయంలో ఈ బిల్లులను శాసనసభలో ఆమోదించారు. ఇది గవర్నర్ వద్ద ఉండగానే జీవో -9 ద్వారా రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటాను అమలు చేసే ప్రయత్నం విఫలం అయింది. ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్‌పై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. ఈ 42 శాతం రిజర్వేషన్లలోని 17 శాతం వాటాను సాధారణ కేటగిరీ (జనరల్ కేటగిరీ) కింద పరిగణించి ఎన్నికలను నిర్వహించుకోవచ్చునని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం రాజ్యాంగ సవరణ మాత్రమే. ప్రస్తుతం స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలంటే పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో తమిళనాడు రాష్ట్రం ఇదే మార్గాన్ని అనుసరించి, 69 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తోంది. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాకాంక్షల మధ్య నెలకొన్న సంక్లిష్ట పోరాటంలో చివరి విజయం ఎవరిదనేది కాలమే నిర్ణయించాలి.

న్యాయపరమైన అడ్డంకులు, సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో, తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు ఒక నిరంతర రాజకీయ, చట్టపరమైన పోరాటంగా మారింది. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయంలో భాగంగా, తెలంగాణ శాసనసభలో తెలంగాణ మున్సిపాలిటీలు (మూడవ సవరణ) బిల్లు, 2025, తెలంగాణ పంచాయతీ రాజ్ (మూడవ సవరణ) చట్టం, 2025లను ఆమోదించింది. విచిత్రమేమిటంటే, గతంలో ఇదే అంశంపై రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి చూస్తున్న సమయంలో ఈ బిల్లులను శాసనసభలో ఆమోదించారు.

# రక్షణరంగ పరిశోధనలో ఆద్యుడు



సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు.ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్శిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు. ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభశైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభలన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తమ 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్శిటీ ఆయనకు డి.ఎస్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఆయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయవంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణమీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వ విద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గాఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా-భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధరంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు.1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్‌గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంత మైన పనిముట్టుగా రూపొందిం చారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండ మైన ఎదుగుదలను సాధించింది.

అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్. బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువ రించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువ రించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.

# సినిమా..

## 100 రోజుల ముందు ట్రైలర్..



పోస్టర్ మీద నాలుగైదు భాషల్లో రిలీజ్ అంటూ ఘనంగా ప్రకటించుకునేవాళ్లే కానీ.. పాన్ ఇండియా స్థాయిలో సరిగ్గా సినిమాను ప్రమోట్ చేసి రిలీజ్ చేసేవాళ్లు తక్కువ. పాన్ ఇండియా స్థాయిలో సినిమా ప్రభావం చూపాలంటే ముందుగా షూటింగ్ పూర్తి చేయడం, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా పర్ఫెక్ట్‌గా జరగడం.. ఇతర భాషల్లో డబ్బింగ్ సరిగ్గా ఉండడం.. దేశవ్యాప్తంగా ప్రమోషన్లు బాగా చేయడం చాలా అవసరం. కానీ ఈ ప్లానింగ్ అన్ని సినిమాలకూ పర్ఫెక్ట్‌గా జరగదు.పవన్ కళ్యాణ్ సినిమా 'ఓజీ' సైతం పాన్ ఇండియా మూవీనే. కానీ ఇతర భాషల్లో నామమాత్ర ంగా రిలీజైంది. ఐతే ప్రభాస్ సినిమా 'రాజా సాబ్' విషయంలో మాత్రం టీం పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో రంగంలోకి దిగుతోంది. ప్రభాస్‌కు మిగతా ఏ ఇండియన్ స్టార్‌కూ లేని స్థాయిలో దేశవ్యాప్తంగా ఫాలోయింగ్, మార్కెట్ ఉన్న మాట వాస్తవం. దాన్ని పూర్తిగా ఉపయోగించుకునేలా 'రాజా సాబ్' టీం అడుగులు వేస్తోంది. 'రాజా సాబ్' చిత్రీకరణ పూర్తి కావచ్చింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా చివరి దశలో ఉన్నాయి. ప్రమోషన్లు కూడా గట్టిగా చేసేలా ఉన్నారు. సినిమా రిలీజ్‌కు ఏకంగా 100 రోజుల ముందే దీని ట్రైలర్‌ను లాంచ్ చేస్తుండడం విశేషం. ఈ సోమవారం సాయంత్రమే ట్రైలర్ వస్తోంది. 'రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. సరిగ్గా వంద రోజుల గ్యాప్ పెట్టుకుని ఇప్పుడే ట్రైలర్ లాంచ్ చేస్తున్నారు. బహుశా పాన్ ఇండియా సినిమాల్లో ఇంత ముందుగా ట్రైలర్ లాంచ్ అవుతున్న సినిమ ఇదే కావచ్చు. రిలీజ్ డేట్ ఖరారైపోవడంతో ఇప్పట్నుంచే విడుదలకు కౌంట్‌డౌన్ మొదలవుతుంది. ట్రైలర్ బాగుంటే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులు సినిమా కోసం ఎదురు చూస్తారు. తర్వాత రెగ్యులర్‌గా ప్రమోషనల్ కంటెంట్ వదులుతూ.. దేశవ్యాప్తంగా ఈవెంట్లు చేస్తూ హైప్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేయనుంది టీం. ముందు ట్రైలర్ లాంచ్ చేసి తర్వాత పాటలు, ఇతర కంటెంట్ వదలడం అరుదైన విషయమే. ఎలాగూ విడుదల దగ్గర్లో రిలీజ్ ట్రైలర్ అంటూ ఇంకో ప్రోమో వదులుతారు. చూస్తుంటే 'రాజా సాబ్' రిలీజ్ టైంకి హైప్ వేరే లెవెల్‌కు వెళ్లేలాగే కనిపిస్తోంది.

## పవన్ కళ్యాణ్ ఓజీకి ఎదురు దెబ్బ!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఓజీ' సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.250 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫ్యాన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక షోలు, టికెట్ ధరల పెంపు కూడా కలెక్షన్స్ పెరగడానికి తోడ్పడింది. అయితే తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఈ సినిమాకి గట్టి షాక్ ఇచ్చింది. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 4 వరకు 'ఓజీ' కి టికెట్ రేట్లు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది.మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్లలో పెరిగిన ధరలకు టికెట్లు విక్రయించడానికి జీఓ కూడా జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.100/–, మల్టీప్లెక్స్‌లలో రూ.150/– మేర టికెట్ రేట్లు పెంచేందుకు తెలంగాణ సర్కార్ అనుమతినిచ్చింది.కానీ ఈ నిర్ణయంపై బర్ల మల్లేష్ యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టికెట్ ధరల పెంపు సామాన్య ప్రేక్షకులపై భారం మోపుతోందని, అదిఅన్యాయం అని వాదించారు.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు తాజాగా టికెట్ ధరల పెంపుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. దీనిని అనుస రించి రాష్ట్ర పోలీస్ శాఖ సోమవారం మరో జీఓ విడుదల చేస్తూ, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆదేశించింది. సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్ యాజమాన్యాలు ఇకపై కేవలం సాధారణ రేట్లకే టికెట్లు అమ్మాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ నిర్ణయం హాట్‌టాపిక్‌గా మారింది. అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా,సామాన్య ప్రేక్షకులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ధరలు తగ్గడంతో మరింత మంది ప్రేక్షకులు థియే టర్లకు రావచ్చని, ఇది చివరికి సినిమాకే లాభమవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా,బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తున్న 'ఓజీ' కి టికెట్ రేట్ల తగ్గింపు కొత్త మలుపు తీసుకువచ్చింది.

## రీఎంట్రీ బాలయ్య సినిమాతోనే?



ఎన్టీఆర్ బయోపిక్స్ కథానాయకుడు, మహానాయకుడు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరవయ్యారు బాలీవుడ్ నటి విద్యాబాలన్. ఆ చిత్రాల్లో ఆమె ఎన్టీఆర్ సతీమణి బసవతారం పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ తెలుగు తెరపై విద్యాబాలన్ కనిపించలేదు. అయితే.. మళ్లీ ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారనేది లేటెస్ట్ న్యూస్. అది కూడా బాలయ్య సినిమాతోనేనట. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ 'అఖండ' సీక్వెల్ 'అఖండ – తాండవం' షూటింగ్‌లో బాలయ్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్ ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఇందులో కథ రీత్యా ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్ పాత్ర ఉందట. ఆ పాత్రకోసం విద్యాబాలన్‌ని బోయపాటి సంప్రదించారనీ, కథ, పాత్ర విన్న తర్వాత ఆమె చేయడానికి అంగీకరించారని సమాచారం. స్టార్‌హీరోయిన్ విద్యాబాలన్‌తో ఆ పాత్ర చేయిస్తున్నారంటే.. కచితంగా కథలో కీలకమైన పాత్రే అయ్యుంటుదని ప్రేక్షకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఇందులో సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇప్పుడు విద్యాబాలన్ కూడా తోడవ్వడంతో.. 'అఖండ–తాండవం' చిత్రానికి బాలీవుడ్‌లోనూ క్రేజ్ ఏర్పడటం ఖాయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తండ్రి అడుగుజాడలలో కుట్టి తల..





తన విజయాల వెనుక భార్య షాలిని హస్తం ఎంతో ఉందని చెబుతూ ప్రముఖ తమిళ నటుడు అజిత్ కుమార్ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను ఎలాబ్యాలెన్స్ చేస్తున్నారన్న విషయంపై స్పందించారు. భార్య షాలిని సహకారం లేకపోతే తాను ఇంతదూరం రావడం సాధ్యపడేదికాదని అజిత్ స్పష్టంగా పేర్కొన్నారు. "మేము 200 2లో పెళ్లి చేసుకున్నాం. అప్పటినుంచి ఆవెనాకు బలంగా నిలిచింది. నేను రేసింగ్‌కు తిరిగి వచ్చినప్పుడు కూడా ఆమె నాతోపాటే వచ్చేది. ఇంటి విషయాలుపిల్లల సంరక్షణ, నా పనులపై దృష్టి అన్నింటినీ సమర్థంగా నిర్వహించేది అని ఆయన అన్నారు.

పిల్లలు పుట్టిన తర్వాత షాలిని ఎక్కువగా ఇంటికే పరిమితమైపోయినా, మోటార్‌స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని మాత్రం కొనసాగిస్తోందని తెలిపారు. తన కుమారుడు గో–కార్టింగ్ ప్రారంభించిన విషయాన్ని వెల్లడించిన అజిత్, "అతను రేసింగ్‌ను కొనసాగిస్తాడో లేదో అతడే నిర్ణయించాలి. సినిమాలు అయినా, రేసింగ్ అయినానేను నా అభిప్రాయాలను పిల్లలపై రుద్దను.వారు తమ ఇష్టమైన దారిని ఎంచుకోవాలి.వారికి నేను పూర్తి మద్దతు ఇస్తాను," అని అన్నారు. వృత్తిపరంగా తరచూ ప్రయాణాల్లో ఉండడం వల్ల పిల్లలతో గడిపే సమయం కొంత మేర కోల్పోతున్నానని, కానీ నిజంగా ప్రేమించే పనిని చేస్తే కొన్ని త్యాగాలు అవసరమేనని భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రొఫెషనల్ రేసర్‌గా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించిన అజిత్ ఇటీవల 24హెచ్ దుబాయ్ కారు రేసింగ్ పోటీలో తన జట్టుతో కలిసి మూడో స్థానం సాధించగా, ఇటలీలో జరిగిన 12% రేస్‌లోనూ మూడో స్థానం దక్కించుకున్నారు. సినిమాల పరంగా ఈ ఏడాది 'పట్టుదల' మరియు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలతో ప్రేక్షకులముందుకు వచ్చిన అజిత్,త్వరలో తన తదుపరి సినిమా వివరాలను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. రేసింగ్ ట్రాక్‌లో వేగంగా పరిగెత్తే అజిత్, జీవితాన్ని మాత్రం నెమ్మదిగా, విలు వలతో, ప్రేమతో నడిపించడంలోనూ ముందున్నారు.

## నార్త్ అమెరికాలో మిరాయ్ ప్రభంజనం..



యంగ్ హీరో తేజ సజ్జా 'మిరాయ్' తో సంచలన విజయాన్ని అందుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఫాంటసీ డ్రామా జానర్‌లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతూ టాలీవుడ్ చరిత్రలో ప్రత్యేక స్థానం సాధించింది. తాజాగా ఈ సినిమా నార్త్ అమెరికాలో **$3** మిలియన్ గ్రాస్ మార్క్ చేరువలో ఉందని సమాచారం. శనివారం ఒక్క రోజులోనే అమెరికా, కెనడా కలిపి ఈ సినిమా 55,000 డాలర్లు వసూలు చేయడం గమనార్హం. ఇప్పటివరకు అక్కడ మొత్తం 2.98 మిలియన్ గ్రాస్ రాబట్టిన మిరాయ్, సోమవారం నాటికి %వి%3 మిలియన్ క్లబ్‌లో చేరుతుందన్న అంచనాలు బలంగా కనిపిస్తున్నాయి. ఈ విజయ ంతో తేజ సజ్జా, టాలీవుడ్ లో ప్రభాస్, ఎన్టీఆర్‌ల తర్వాత వరుసగా రెండు సినిమాలతో %వి%3 మిలియన్ మార్క్ అందుకున్న మూడో హీరోగా ఘనత సాధించనున్నాడు. చిన్న హీరోగా పరిచయమైన తేజ సజ్జా ఇప్పుడు స్టార్ హీరోల సరసన నిలవడం గమనార్హం. మిరాయ్ సినిమాతో అతని క్రేజ్ మరో స్థాయికి చేరిందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా మిరాయ్ వసూళ్ల పరంగా శరవేగంగా దూసుకుపోతోంది. ఇప్పటి వరకు ఈ చిత్రం ?150 కోట్ల దిశగా వసూళ్లు సాధించడం, పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ పొందడం విశేషం. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మంచు మనోజ్, ఋతికా నాయక్, శ్రియా శరన్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్, థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లే, ఎమోషనల్ కంటెంట్ సినిమాకు హైలైట్‌గా నిలిచాయి. ఈ విజయంతో తేజ సజ్జా తదుపరి సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఓ చిన్న హీరోగా ప్రారంభమై, పాన్ ఇండియా విజయం సాధించడం తేజ సత్తా ఏంటో తెలియజేస్తుంది. రానున్న రోజులలో 'మిరాయ్' ఇంకా ఎన్ని రికార్డులు నమోదు చేస్తుందో చూడాల్సిందే.

## కలలోనూ ఊహించలేదు.. : రుక్మిణీ



రుక్మిణీ వసంత్.. నిన్న మొన్నటి వరకు కన్నడ సినీ ఇండస్ట్రీలో ఈ పేరుపుల్ గా వినిపించింది. అక్కడ తీసిన సప్త సాగరాలు దాటి సిరీస్ చిత్రాలతోపాటు బఘీర వంటి సినిమాలతో ఆమె మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. రీసెంట్ గా కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ లీడ్ రోల్ లో తెరకెక్కిన మదరాసితో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్మిణీ.. తన యాక్టింగ్‌తో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు అక్టోబర్ 2వ తేదీన కాంతార చాప్టర్ 1తో సందడి చేయనున్న అమ్మడు.. తాజాగా ఇచ్చిన ఓఇంటర్వ్యూలో పలు విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా కాంతార ప్రీక్వెల్ మూవీ ఛాన్స్ కోసం మాట్లాడారు. తాను నటించిన సప్తసాగరాలు దాటి, ఏస్ మూవీలను రిషబ్ శెట్టి చూశారని, ప్రీమియర్స్ కు వచ్చి తన నటనను మెచ్చుకున్నారని తెలిపారు. కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com